# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 213

VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: శుక్రవారం 04 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఎన్నికల్లో కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన ఓట్ల కౌంటింగ్‌పై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టేసింది. పిటిషన్ విచారణకు అర్హమైనది కాదని చీఫ్ జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో స్టాలిన్‌కు 74,202 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థి టీవీకే పార్టీకి చెందిన వీఎస్ బాబు 82,997 ఓట్లతో విజయం సాధించారు. ఫలితాలపై సందేహాలు వ్యక్తం చేసిన డీఎంకే అధినేత మే7 ఈవీఎంల బర్న్ మెమరీ, మైక్రోకంట్రోలర్ పరిశీలను దరఖాస్తు చేసుకున్నారు. జులై 29న జరిగిన పరిశీలన సందర్భంగా కొన్ని ఈవీఎంలు పనిచేయకపోవడాన్ని స్టాలిన్ గుర్తించారని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. నిజానిజాలు తెలుసుకునేందుకు నియోజకవర్గంలోని 100 శాతం వీవీప్యాట్‌లను మళ్లీ పరిశీలించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ తరఫున సీనియర్ అడ్వకేట్స్ న్యాయవాదులు జీ రాజగోపాల్, దామా శేషాద్రి నాయుడు హాజరయ్యారు. వారు తమ వాదనలు వినిపిస్తూ ఎన్నికల కౌంటింగ్‌పై అభ్యంతరాలను ఈసీఐకి పిటిషన్ ద్వారానే పరిష్కరించాలని చెప్పారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం ఈ పిటిషన్‌ను కొనసాగించే అవకాశం లేదని అన్నారు. ఈ కేసులో ఇటీవలే వాదనలు ముగిశాయి.




**సమయం ప్రతినిధి:** తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెన్నై నగరాన్ని ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సెంటర్‌గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేసింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలోని 110వ నిబంధన కింద ఒలింపిక్ సిటీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం జోసెఫ్ విజయ్ ప్రకటించారు. రాష్ట్ర క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో ప్రపంచ స్థాయి క్రీడా వేదికలు, ఆధునిక శిక్షణ పరికరాలు, హై పర్ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ కేంద్రాలు వంటివాటిని నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. అంతేకాకుండా క్రీడాకారులు, కోచ్‌ల కోసం వసతి సదుపాయాలతో కూడిన సమగ్ర క్రీడా కేంద్రంగానూ చెన్నైని అభివృద్ధి చేయనున్నట్టు తెలుస్తోంది. దేశంలోకి ఫార్ములా వన్ రేసింగ్‌ను తిరిగి తీసుకురావడం సహా అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించేలా అత్యుత్తమ శిక్షణ, సహాయక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. '2028 నాటికి భారత్‌లోకి ఎఫ్-1ను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఇందుకోసం దేశంలో మోటార్ స్పోర్ట్స్‌ను పర్యవేక్షించి, మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించేందుకు ఓ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేశాం' అని యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది. అదే సమయంలో చెన్నైలో ప్రత్యేకంగా మోటార్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసి ఫార్ములా-1 నుంచి ఎఫ్-4 వరకు రేసులు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.




**సమయం ప్రతినిధి:** కోల్‌కతాలో టీఎంసీ నేత, ఎంపీ అభిషేక్ బెనర్జీ కార్యాలయంపై దుండగులు దాడి చేశారు. గురువారం తెల్లవారుజామున మాస్కులు, హెల్మెట్లు ధరించిన దుండగులు కార్యాలయంలోకి ప్రవేశించి నానా రభసా సృష్టించారు. వస్తువులను చెల్లాచెదురుగా పడేసి, అద్దాలను పగలగొట్టారు. కొన్నింటి వస్తువులను తమ వెంట తీసుకెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను అభిషేక్ బెనర్జీ షేర్ చేశారు. ఈ దాడి వెనుక బీజేపీ ఉందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై పశ్చిమబెంగాల్ గవర్నర్, హోం మంత్రి అమిత్ షా చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి తనపై బెదిరింపులకు దిగుతున్నారని ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. టీఎంసీ పార్టీని, తనను చూసి సీఎం భయపడుతున్నారని అన్నారు. 'రాష్ట్రంలోని ప్రతిపక్షం హింసాత్మ ఘటనలు, దాడులు, బెదిరింపులు గురవుతుంటే సీఎంకు అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేనట్టే అని తేల్చి చెప్పారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను తాము ఎన్నటికీ మర్చిపోబోమని కూడా చెప్పారు. ఈ దాడిపై టీఎంసీ ఐటీ సెల్ ఇంచార్జ్ ఉపాసన చౌదరి స్పందించారు. బీజేపీతో సంబంధంతో ఉన్న వారే ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.




**వనపర్తి జిల్లా, సమయం ప్రతినిధి :** పదవి ఉన్నా.. లేకున్నా తన గౌరవం తనకు ఉంటుందని మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి అన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోనని స్పష్టం చేశారు. పదవిలో ఉన్నా, లేకున్నా వారి కోసం ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉంటానని తేల్చి చెప్పారు. గురువారం గోపాల్‌పేట మండలంలోని తన స్వగ్రామం జయన్న తిరుమలాపూర్‌లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తనను తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి పదవి నుంచి తొలగించడంపై చిన్నారెడ్డి స్పందించారు. క్యాబినెట్ హోదా ఉన్న సమయంలోనే తనకు ప్రభుత్వం కల్పించిన కారు, డ్రైవర్, సెక్యూరిటీ తదితర సౌకర్యాలను తిరిగి పంపించానని చిన్నారెడ్డి తెలిపారు. తనకు ఇచ్చిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవికి సంబంధించిన ఉత్తర్వుల్లోనే 'ఇంటిగ్రేటెడ్ ఆర్డర్'గా పేర్కొన్నారని, అయితే ఎన్ని సంవత్సరాల పాటు పదవిలో కొనసాగాలనే విషయాన్ని అందులో ప్రస్తావించలేదన్నారు. తన కుమారుడికి ఏదైనా పదవి ఇప్పించాలని ముఖ్యమంత్రి వద్ద తాను ఎప్పుడూ అడగలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీలో వి. హనుమంతరావు తర్వాత తానే సీనియర్ నాయకుడినని పేర్కొన్నారు. ప్రస్తుతం తలెత్తిన సమస్యకు ప్రధాన కారణం కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవేనని చిన్నారెడ్డి ఆరోపించారు. తన రాజకీయ ప్రస్థానం, పార్టీ కోసం చేసిన సేవలను గుర్తు చేస్తూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో 42 మంది ఎమ్మెల్యేలతో వనపర్తిలో భారీ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో సంతకాలు సేకరించి ఉద్యమానికి తాను ఊపిరి పోసినట్లు గుర్తు చేసుకున్నారు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయని, అయితే ప్రజలు, కార్యకర్తలతో తన అనుబంధం మాత్రం శాశ్వతమని చిన్నారెడ్డి పేర్కొన్నారు. పదవి లేకపోయినా ప్రజల మధ్యనే ఉంటానని, తనను నమ్ముకున్న వారి కోసం ఎప్పటికీ పనిచేస్తానని స్పష్టం చేశారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ (గురువారం) ప్రారంభించారు. స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవం అనంతరం దానిపై ఆయన ప్రయాణించారు. ఆ తర్వాత వంతెనకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ వివరాలను ముఖ్యమంత్రికి జీహెచ్ఎంసీ అధికారులు వివరించారు. దీని ప్రారంభంతో గ్రేటర్ హైదరాబాద్‌లో మరో భారీ వంతెన అందుబాటులోకి వచ్చినట్లైంది. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భాగ్యనగరంలో ఇప్పటికే అతి పొడవైన స్టీల్ వంతెన 2.3 కిలోమీటర్ల పొడవుతో ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు ఉంది. తాజాగా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని 3.32 కి.మీ.ల పొడవుతో రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ వంతెన చంచల్‌గూడ జైలు నుంచి సంతోష్ నగర్‌లోని యాదగిరి థియేటర్ వరకు ఉంది. కాగా, వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నాలుగు లేన్ల ఈ బ్రిడ్జి నిర్మాణానికి 2020లో శంకుస్థాపన జరిగింది. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో నల్లగొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ ఆస్పత్రి జంక్షన్ వరకు 5 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం లభించింది. కాగా, ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణించేందుకు 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతోంది. తాజాగా బ్రిడ్జి ప్రారంభంతో నగరవాసులకు ప్రయాణం సులభం కానుంది.

## గల్ఫ్ వలస కార్మికుడి కుటుంబానికి రూ.19.01 లక్షల బీమా చెక్కు

## మాసప్ప కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3, సమయం ప్రతినిధి:** గల్ఫ్‌లో పనిచేస్తూ స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందిన గల్ఫ్ వలస కార్మికుడు ముసిరిప్ప మాసప్ప కుటుంబానికి రూ.19,01,968 బీమా సొమ్ముకు సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అందజేశారు. గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామానికి చెందిన ముసిరిప్ప మాసప్ప గత 15 సంవత్సరాలుగా గల్ఫ్ దేశంలో వలస కార్మికుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. 2025 మే 22న స్వగ్రామానికి వచ్చిన ఆయన తిరిగి గల్ఫ్‌కు వెళ్లేందుకు విమానం ఎక్కే క్రమంలో గుండెపోటుకు గురై మృతి చెందారు. గల్ఫ్‌లో పనిచేస్తున్న సమయంలో మాసప్ప పనిచేస్తున్న కంపెనీతో కుదుర్చుకున్న బీమా ఒప్పందం మేరకు రూ.19,01,968 బీమా మొత్తం మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాసప్ప భార్య ముసిరిప్ప వెంకటమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల కుటుంబాలకు బీమా పథకాలు ఆపద సమయంలో ఆర్థిక భరోసాను అందిస్తాయని తెలిపారు. వలస కార్మికులు, వారి కుటుంబాలు అందుబాటులో ఉన్న సంక్షేమ, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎ. నిర్మల, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జితేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగానికి నీళ్లు ఇవ్వరా?..

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూటి ప్రశ్న..



**సమయం ప్రతినిధి:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫోన్ చేస్తే ఆటోలో యూరియా వచ్చేదని, కాంగ్రెస్ పాలనలో మాత్రం యూరియా కోసం రైతులు తమ చెప్పులను లైన్లలో పెట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. నల్లగొండ జిల్లాకు దరిద్రాన్ని తెచ్చుకుని నెత్తిన పెట్టుకున్నా మని.. రక్తం రుచి మరిగిన కాంగ్రెస్ రాక్షస పులిని తెచ్చుకున్నామంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిర్యాలగూడలో కేటీఆర్ ఈరోజు (గురు వారం) పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులపై తీవ్ర విమర్శలు గుప్పించారు. నాగార్జునసాగర్‌లో నీళ్లు ఉన్నప్పటికీ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు శనిలా దాపురించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ రైతుల కళ్లల్లో నీళ్లు తెప్పించిన 'నీళ్ల మంత్రి' ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలనూ కేటీఆర్ ప్రస్తావించారు. సొరంగంలో 'వాటర్‌లో నీళ్లు కలిశాయి' అంటూ మంత్రి మాట్లాడారని.. అసలు ఆయన 'క్వార్టర్‌లో నీళ్లు కలిశాయో ఏమో' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హుజూర్‌నగర్‌లో నీళ్ల కోసం రైతులు తమ బాధలు చెప్పుకుందామంటే వారిని గెదుముతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వ్యవహారం కూడా అందుకు భిన్నంగా లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే సీఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నారని, అందుకే తెలంగాణ నీళ్లు కిందికి పోతున్నా మాట్లాడటం లేదని ఆరోపించారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి లోపు రైతులకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పటిలోగా నీళ్లు ఇవ్వకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. ఈనెల 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు నీళ్లు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## పాశ్చాత్య వెలుగులే మనకు చీకట్లు!

మనం వాస్తవంగా ఒక అలసిన శతాబ్దంలో జీవిస్తున్నాం. ఈ ధరిత్రిపై భారత భూమికి సుదూర దేశాలలో గతించిన యుగాలలో నిర్మాణమైన మేధోసౌధం శిథిలాలలో నివసిస్తున్నాం. ఆ మేధోసౌధం మనదే అని విశ్వసిస్తున్నాం. అదొక తప్పుడు విశ్వాసం, భ్రమ. దానినుంచి బయటపడలేనితనం మనలను కుంగదీస్తోంది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట మానవ తప్పిదం కారణంగా ఏదో ఒక దుర్ఘటన సంభవిస్తోంది. నేపాల్ వరద బీభత్సం, గాజాలో జాతి సంహారం, డోనాల్డ్ ట్రంప్ అరాచకత్వం ప్రపంచాన్ని బాధిస్తున్నాయి, వేధిస్తున్నాయి. మన జీవనోన్నతికి ఏ భావాలయితే తోడ్పడాలో అవే మనకు వ్యతిరిక్తమయ్యాయి. 'భవిష్యత్తుపై గతం తన వెలుగులు ప్రసరింపజేయడం మానేసినందున మనిషి మనసు అంధకారంలో సంచరిస్తోంది' అని రెండు శతాబ్దాల క్రితం అలెక్సిస్ డి టోక్‌విల్లే అనే ఫ్రెంచ్ మేధావి వ్యాఖ్యానించాడు. ఇప్పుడు మనమూ అటువంటి సంకటస్థితిలోనే ఉన్నాం. ఒక సంధికాలంలో కొట్టుమిట్టాడుతున్నాం. గతించిన కాలపు భావాలతో భవిష్యత్తులోకి వెళ్లడానికి ప్రయత్నించడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. యూరోప్ ఘనమైన గతం కానీ, అమెరికా ప్రశస్త వర్తమానం కానీ మన భవిష్యత్తుకు మార్గదర్శకాలు కాలేవు. పాశ్చాత్య ఆధునికత మాసిపోయింది. కొత్తదనాన్ని కోల్పోయింది. దుర్గంధాన్ని వెదజల్లుతోంది. అయినా మనం రోజూ దానికి మెరుగులు దిద్ది మన పిల్లలకు నేర్పుతున్నాం. ప్రజాస్వామ్యాన్నే తీసుకోండి. అదొక సమ్మోహన సమున్నత ఆదర్శం. గత శతాబ్దంలో అది ఒక విప్లవాత్మక భావం. ఇప్పుడు ప్రపంచానికి ప్రామాణిక ఆదర్శం. దానినే మనం ఉదారవాద ప్రజాస్వామ్యం అని పిలుస్తున్నాం. ప్రజా సార్వభౌమత్వం అనే మరో సమున్నత భావాన్ని పోటీదాయక ఎన్నికల ద్వారా అధిక సంఖ్యాకుల పాలన ప్రాతిపదికన ప్రాతినిధ్య ప్రభుత్వంగా మార్చివేశాం. అయితే మనం ప్రజాస్వామ్యంగా భావిస్తున్న పాలనా పద్ధతులు కొద్దిమందికి మాత్రమే స్వపరిపాలనను సమకూర్చాయి. ఆధునిక ప్రజాస్వామ్యం నిజానికి ప్రజలు సాధికారత కోల్పోయేలా చేసింది. రాజ్య వ్యవస్థను సర్వశక్తిమంతం చేసింది. నాయకత్వాలు జవాబుదారీతనం లేకుండా వ్యవహరించేందుకు తోడ్పడింది. మీడియా పూర్తిగా కార్పొరేట్ నియంత్రిత రంగం కావడానికి దోహదం చేసింది. ధనశక్తికి అపార ప్రాధాన్యమిచ్చింది. ఇవన్నీ ప్రజలను నిస్సహాయులను చేశాయి. ప్రజా సార్వభౌమత్వం బోలుమాటగా మిగిలిపోయింది. ప్రజాకర్షక రాజకీయాలు, మెజారిటీవాదం ఎన్నికైన నిరంకుశ ప్రభుత్వాలు.. ఆధునిక ప్రజాస్వామ్య రుగ్మతలు కావు, అవి మనం ప్రజాస్వామ్యంగా అంగీకరించి, అమలు జరుపుకుంటున్న యంత్రాంగం సహజ పరిణామాలు. మన మరో గొప్ప ఆదర్శం జాతిరాజ్యం. ఏదో ఒక దానికి 'చెందిన' భావన, సొంతవారని భావించేవారితో సాంగత్యం, అనుబంధం పెంపొందించుకోవడం ప్రతి వ్యక్తికీ ఒక మానసిక అవసరం. ఆధునిక యుగంలో ప్రపంచాన్ని 'జాతులు' అనే రాజకీయ సమాజాలుగా విభజించి సుస్థిరపరచడం ద్వారా ఈ స్వతస్సిద్ధ మానవ అవసరాన్ని తీర్చారు. ఈ రాజకీయ సమాజాలే జాతి రాజ్యాలు. నిశితంగా పరిశీలిస్తే జాతులు అనేవి ఊహాజనిత సమాజాలు. ఇవి అధికార కేంద్రాలుగా పనిచేస్తూ తమ పరిధిలోని ప్రతి ఒక్కరి నుంచి తిరుగులేని విధేయతను కోరతాయి. ఇక్కడే, జాతి రాజ్యాలతో సమస్యలు తలెత్తుతున్నాయి. జాతి రాజ్యాల చరిత్రను చూస్తే అవి మనుషులను కలిపి ఉంచలేదు సరికదా వేరు చేశాయి. 'మనం', 'వారు' అనే భావనను నెలకొల్పి వైషమ్యాలు రెచ్చగొట్టాయి. ఈ రాజకీయ సమాజాల ప్రభావంతో ఇరుగుపొరుగువారినీ ద్వేషించడం జరుగుతోంది. ఇరవయో శతాబ్ది యుద్ధాలే ఇందుకు నిదర్శనం. ఈ సంకుచిత జాతీయవాదం జాత్యహంకారంగానూ, యుద్ధోన్మాదంగానూ వెర్రితలలు వేసింది, వేస్తోంది. కూడు, గూడు, గుడ్డ మానవుని సహజ అవసరాలు. ఇవి అంత తేలిగ్గా తీరవు. తీరినా ఇంకా ఎన్నో కోరికలు ఉంటాయి. భౌతిక శ్రేయస్సును పరిపూర్ణంగా సమకూర్చుకోవాలని సదా స్వప్నిస్తాడు. ఆ స్వప్నసాధననే ఇరవ–యో శతాబ్దిలో 'అభివృద్ధి' అని చెప్పుకున్నారు. భౌతిక శ్రేయస్సును సమకూర్చుకోవడాన్ని మనం ఇప్పటికీ 'అభివృద్ధి'గా భావిస్తున్నాం. ఆ 'అభివృద్ధి' సాధనను ఒక ఉత్కృష్ట విషయంగా ఔదలదాలుస్తున్నాం. పారిశ్రామికీకరణ, పట్టణీకరణలతో అటువంటి అభివృద్ధిని సాధించాం.. ప్రైవేట్ ఆస్తి, స్వేచ్ఛా విపణి, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రాధాన్యమిచ్చే పెట్టుబడిదారీ ఆర్థిక విధానం ఆ అభివృద్ధికి ప్రధాన చోదకశక్తి. అయితే ఆ అభివృద్ధి స్వప్నాలు వికటిస్తున్నాయి. సిరిసంపదలు కొంతమందికి మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. సిరులు సృష్టించే శ్రమ జీవులకు ఏమీ దక్కడం లేదు. జీవన ప్రమాణాలు ఇతోధికంగా మెరుగుపడినప్పటికీ మనిషి ఆకాంక్షలూ పెరిగిపోయాయి. ఫలితంగా సహజవనరులు తరిగిపోతున్నాయి. మన ధరిత్రి మానవుని అవసరాలను తీర్చగలదేగానీ అతడి అపరిమిత భోగలాలసను సంతృప్తిపరచలేదు. ఈ కారణంగానే పలు సంక్షోభాలు, ముఖ్యంగా పర్యావరణ విధ్వంసం సంభవిస్తోంది. దీనిని నిలిపివేయకపోతే ప్రకృతికి, మానవేతర జీవకోటికి, భావి తరాలకు తీరని నష్టం వాటిల్లడం ఖాయం. విధ్వంసక అభివృద్ధి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అనేవి మనం అనుసరిస్తున్న ఆర్థికాభివృద్ధి నమూనా లోపాలు కాదు, అవి దాని సహజ లక్షణాలు.అజ్ఞానం, అసత్యాల నుంచి స్వేచ్ఛ సాధించడమే మన నాలుగో అన్వేషణ. ఆధునిక వైజ్ఞానిక పద్ధతి ఇందుకు తోడ్పడుతోంది. సమస్త జ్ఞాన రంగాలు అనుసరించాల్సిన నిర్దిష్ట నియమావళిని అది రూపొందించింది. ఏది సత్యం, ఏదసత్యం అనేదాన్ని నిర్ధారించింది. దీని ప్రకారం ఏది జ్ఞానం? సర్వత్రా ఒకే విధమైన ఫలితాలను ఇచ్చేది, క్రమబద్ధమైన ధ్రువీకరణకు సాధ్యమయ్యేదే ప్రామాణిక జ్ఞానం. సాంకేతిక విజయాలు ఆ జ్ఞానానికి అంతిమ రుజువు. ఈ పద్ధతి మానవ సమస్యలను పరిష్కరించడంలో సఫలమవుతున్నందున విజ్ఞానశాస్త్రం మన కాలపు కొత్త మతంగా పరిగణన పొందింది. అయితే అది మానవ మేధను సంకుచితపరిచింది. నైతిక ప్రాతిపదికలు కోల్పోయేలా చేసింది. పాశ్చాత్య మేధో ఆధిపత్యాన్ని నెలకొల్పింది.ప్రతి మనిషీ సంతోషమయ జీవితాన్ని కోరుకుంటాడు, మానసిక సాంత్వనలకూ ఆరాటపడతాడు. భౌతిక సౌఖ్యం, మానసిక ప్రశాంతికి మానవుని అన్వేషణను మనం విధిగా పట్టించుకోవాలి. పాశ్చాత్య ఆధునికతతో అంకురించి ప్రపంచవ్యాప్తమైన 'లౌకికవాదం' అన్ని మతాల స్వభావాన్ని మార్చివేసింది. సమస్త సమాజాలూ లౌకికవాద భావజాలాన్ని ఆచరణలో కాకపోయినా సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నాయి. మతం క్షీణించకపోగా నిర్దిష్ట మతపరమైన అనుయాయులను మరింత మతనిష్ఠతో వర్గీకరించడం జరుగుతోంది. విభిన్న మత వర్గాల మధ్య పోటీ పెచ్చరిల్లుతోంది. దీనివల్ల మత పరమార్థం ఉపేక్షితమవుతోంది. ప్రతి మతంలోను వ్యాపార, ఛాందసవాద ధోరణులు పెరుగుతున్నాయి. ఆధునిక మానవుడు గత తరాల కంటే సుఖసంతోషాలతో బతుకుతున్నాడని, అతడి జ్ఞానసంచయం మున్నెన్నడూ లేని రీతిలో అపారమైనదని మీరు అనవచ్చు. కానీ, మన తాత ముత్తాతల కంటే మనం సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నామని మీరు చెప్పగలరా? 'భూత' అనే పదానికి మరో అర్థం కూడా ఉన్నది. అది భౌతిక జగత్తులోని ప్రాథమిక పదార్థాలను సూచిస్తుంది. హిందూ మత గ్రంథాల ప్రకారం ఆ ప్రాథమిక పదార్థాలు ఐదు. అవి: భూమి, నీరు, గాలి, అగ్ని, ఆకాశం. ఆధునిక మానవుని స్వతస్సిద్ధ స్వభావంలోనూ అటువంటి అయిదు ప్రాథమిక అంశాలను మనం గుర్తించాలని 21వ శతాబ్దం ఆహ్వానిస్తోంది. ఆ స్వాభావిక మానవ అవసరాలు: స్వయం ప్రతిపత్తి, అనుబంధం, శ్రేయస్సు, సత్యం, ఆనందం. గత శతాబ్దపు రాజకీయ, సామాజిక, ఆర్థిక నిర్మాణాలు ఈ అవసరాలను తీర్చడంలో విఫలమయినందున మనం కొత్త వ్యవస్థలను నిర్మించుకోవాలి. ఇందుకు మనం పాత ఆధిపత్య చింతనా ధోరణులకు భిన్నంగా ఆలోచించవలసి ఉంది. ఇప్పటివరకు మనలను ప్రభావితం చేస్తున్న పాశ్చాత్య ఆధునికత ప్రభావశీలత కృశించిపోతోంది. దాని వెలుగులు క్షీణించిపోతున్నాయి. పాశ్చాత్యేతర సమాజాలలో సమున్నత జ్ఞాన సంప్రదాయాలు ఉన్నాయని, అవి మన జీవితాలను అర్థవంతం, ఆనందప్రదం చేసేందుకు యోగ్యమైన ప్రత్యామ్నాయ ఆలోచనా స్రవంతులను సమకూరుస్తాయనే సత్యాన్ని గుర్తించాలి. పాశ్చాత్య ఆధునికతకు భిన్నమైన భావ సాహసాలు చేయగలిగితే 21వ శతాబ్దాన్ని భూతకాలంగా (దాని అత్యుత్తమ అర్థంలో) మార్చుకోగలమనడంలో సందేహం లేదు.

# ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ కీలక భేటీ.. ఖర్గేతో డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ సమావేశం...!



న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు, కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఢిల్లీలో కీలక చర్చలు జరిగాయి. ఏఐసీసీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే ని తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్, నాగర్‌కర్నూల్ ఎంపీ శ్రీ మల్లు రవి, మంత్రి శ్రీధర్

**తెలంగాణ రాజకీయ పరిస్థితులపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సుదీర్ఘ చర్చలు**

బాబు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

**తెలంగాణ రాజకీయాలపై విస్తృత చర్చ :** ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చలపై ఖర్గే గతో నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.

**పార్టీ క్రమశిక్షణపై కీలకంగా చర్చ :** పార్టీ క్రమశిక్షణను కాపాడటం, పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగడం, అవసరమైన క్రమశిక్షణాపరమైన చర్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

**మంత్రి వర్గ విస్తరణ.. ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి**

తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు, పార్టీకి సంబంధించిన కీలక పదవుల భర్తీ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు తదితర అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

**పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందడుగు :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని మరింత పెంచడం వంటి అంశాలపై కూడా అగ్ర నాయకత్వంతో చర్చలు సాగినట్లు సమాచారం.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**ఆరు గ్యారెంటీలు.. 420 హామీల అమలుపై నిలదీత**
**చిన్నచింతకుంటలో రైతులతో కలిసి భారీ నిరసన ర్యాలీ**
**మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన**

సమయం: సెప్టెంబర్ 3, మహబూబ్‌నగర్ : దేవరకద్ర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చిన్నచింతకుంట మండల కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ప్లకార్డులు ప్రదర్శించారు. హామీలను తక్షణమే అమలు చేయాలని నినాదాలు చేస్తూ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ నాయకులు ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను ప్రత్యేకంగా ప్రదర్శించేలా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ నిరసన కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్



ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ విలయం.. ప్రకృతి ప్రతీకారం!

**సమయం ప్రతినిధి :** ఇటీవలి నేపాల్ విలయం వేలాది కుటుంబాలను విషాదాంధకారంలోకి నెట్టివేసింది. హిమాలయ మంచు కొండల శిఖరాగ్రంలో హిమానీపాతం, రాళ్లు, మట్టి కలిసి భోటేకోశీని చివరకు భయంకరమైన బురద నదిగా మార్చివేశాయి. దాంతో గత ఆగస్టు 26న నేపాల్ సహా, టిబెట్ వెంబడి పలు గ్రామాలు, పట్టణాల్లోని సరిహద్దు పోస్టులు, పెద్ద ట్రక్కులు, రహదారులు, విద్యుత్, మౌలిక సదుపాయాలు, ప్రజలను కీటకాల్లా ఆ బురద వరద మింగేసింది. పదకొండు వందల మందికి పైగా ప్రజల మరణానికి, 4,858 మంది ప్రజల అదృశ్యానికి, జీవజాలం నాశనానికి, లక్షల కోట్ల ఆర్థిక నష్టానికి ఈ విలయం కారణమయ్యింది. తమను తుడిచిపెట్టబోయే ఆ బురద సునామీ నుంచి తప్పించుకోడానికి ప్రాణభయంతో పరిగెడుతున్న చిన్న చిన్న మానవరూపాల దృశ్యాలు దిగ్భ్రాంతి కలిగించాయి. ప్రకృతి జరిపిన ఈ దాడి విస్తృతి మనల్ని ఆశ్చర్యపరుస్తోంది. ఈ తరహా దాడిని తట్టుకునే, నివారించగలిగే దృక్కోణం, సామర్థ్యం ఏ మానవ భద్రతా వ్యవస్థకూ లేకపోవడం దురదృష్టకరం. నాగాలాండ్, అస్సాం రాష్ట్రాల్లో.. జూలైలో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన వరద విపత్తుతో పోలిస్తే నేపాల్ ప్రళయం చాలా పెద్దది. ఈ రెండు సందర్భాల్లోనూ కొన్ని సారూప్యతలు ఉన్నాయి. ఇవి మారుతున్న వాతావరణ సరళి, గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ మార్పులకు సంబంధించినవి. మానవ తప్పిదాలే ఈ విలయాలకు ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. ఎత్తైన హిమాలయాలలోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థల ద్వారా, అలాగే దిగువ కొండలు, నదుల ద్వారా ప్రకృతి పదేపదే హెచ్చరికలు పంపినప్పటికీ, ఆ అంశాలను మనం పట్టించుకోలేదు. వాతావరణ మార్పు వచ్చేసింది, అది దాని సహజ స్థితికి తీసుకురాలేని దశకు వేగంగా చేరుకుంటోంది. తత్కారణంగా.. వేల మీటర్ల ఎత్తులో ఉన్న హిమానీనదం శిథిలమవడం వల్లగానీ, విస్ఫోటనం చెందే ప్రమాదంలో ఉన్న హిమానీనద సరస్సుల వల్లగానీ, కొండచరియలు విరిగి పడటానికి కారణమయ్యే తీవ్ర వర్షాల వల్ల గానీ, లేదా బలహీన ప్రాంతాలలో ఉధృతంగా ప్రవహించే వరద నీటి ప్రవాహం వల్ల గానీ తీవ్రమైన వాతావరణం, వర్షాలు, తుపానులు, భారీ వరదల వంటి మరిన్ని విపత్తులకు మనం సిద్ధంగా ఉండాలని ప్రకృతి చాలా కాలంగా హెచ్చరిస్తూనే ఉంది.ఆ హెచ్చరికల్ని మన పాలకులు నిర్లక్ష్యం చేస్తూ అభివృద్ధి పేర పర్యావరణ విధ్వంసాన్ని సృష్టిస్తూనే ఉన్నారు. రాజకీయ నాయకులు, వారిని పోషించే కార్పొరేట్ సంస్థలు, కాంట్రాక్టర్ల జేబుల నింపడం తప్ప మరేమీ చేయని ప్రతిష్ఠాత్మకమైన ఆరు/ నాలుగు లేన్ల హైవేలు సహా, మొత్తం హిమాలయ– టిబెట్ ప్రాంతంలోని అన్ని ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిలిపివేయాలి. సామ్రాజ్యవాది చైనా నిర్మిస్తున్న భారీ నీటి ప్రాజెక్టు, హైడ్రో ఎలక్ట్రిక్, మిలటరీ నిర్మాణాలు నిలిపివేయకపోతే ప్రకృతి క్రోధానికి ప్రజలు బలి కాకతప్పదు. ఆ నిర్మాణాల వల్ల హిమాలయ ప్రాంతం, తూర్పు పర్వతాల్లో కొండ చరియలు విరిగిపడి వేలాది మంది ప్రజలకు జీవన్మరణ సమస్యలు సృష్టిస్తున్నాయి. నేపాల్ వంటి విపత్తు సంభవిస్తుందనే భయంతో హిమాలయ ప్రాంత ప్రజలు అన్ని జల విద్యుత్ ప్రాజెక్టులనూ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చైనా, భారత్, నేపాల్, భూటాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి అన్ని దేశాల నిపుణులంతా ప్రమాదాలను అంచనా వేసి, రక్షణ ప్రణాళికలను రూపొందించుకోవాలి. ప్రకృతిపై మనం సాధించే విజయాల గురించి మరీ ఎక్కువగా గర్వపడకూడదు. ఎందుకంటే, అటువంటి ప్రతి విజయానికీ ప్రకృతి మనపై ప్రతీకారం తీర్చుకుంటుంది. నిజమే, ప్రతి విజయం మొదట మనం ఆశించిన ఫలితాలనే ఇస్తుంది; కానీ తదుపరి దశలలో అది పూర్తిగా భిన్నమైన, ఊహించని పరిణామాలకు దారితీస్తుంది. అవి తరచుగా ఆ తొలి ఫలితాలనే రద్దు చేసేలా ఉంటాయి. అంటే.. ప్రకృతిపై మనం ఒక విజేతలాగా ఆధిపత్యం చలాయించలేమని ప్రతి అడుగులోనూ అది మనకు గుర్తుచేస్తోంది. ప్రపంచ దేశాలు వాతావరణ మార్పు, భూతాపం అనే సమస్యలపై ఎన్నిసార్లు అంతర్జాతీయ సమావేశాలు, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకున్నా కార్పొరేట్ శక్తుల అత్యాశకు అవి ఆచరణయోగ్యం కాకుండా పోతున్నాయి. భూగోళంలోని అన్ని రకాల జీవ–నిర్జీవ వ్యవస్థలు, ప్రక్రియలన్నీ కార్పొరేట్ సంస్థల స్వార్థానికి కోలుకోలేని విధ్వంసక స్థితికి చేరుకుంటున్నాయి. 'ప్రకృతి మన కొనసాగింపు' అనే స్పృహ, దృక్కోణం లేకుండా కేవలం మానవ అవసరాలను తీర్చే వినియోగ వస్తువుగాను, సంపదగాను ప్రకృతిని చూసే రాజకీయార్థిక విధానాన్ని విడనాడకపోతే మానవజాతి కూడా అంతరించిపోతున్న జీవరాశుల జాబితాలో చేరే ప్రమాదం ఉంది. ప్రకృతి––సమాజాల మధ్య ఆదాన ప్రదానాల క్రమాన్ని పునరుజ్జీవింపజేసే దృక్పథంతో కూడిన సమాజం కోసం ప్రజలు ఈ గ్లోబల్ కార్పొరేట్ పక్షపాత ప్రభుత్వాలను, రాజ్యాలను జెన్‌జీ ఉద్యమ స్ఫూర్తితో నిలదీయాల్సిన అవసరాన్ని నేపాల్ బురద వరద బీభత్సం నొక్కి చెబుతోంది.

# వినియోగదారులకు మరింత సేవలు అందించాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్**

మహబూబాబాద్ సెప్టెంబర్ 03 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లాలోని వినియోగ దారులకు మరింత సేవలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్ సూచించారు. గురువారం ఐడిఓసిలో జిల్లా వినియోగదారుల సేవా కేంద్రాన్ని వినియోగదారుల సేవా కేంద్రం చైర్మన్ వింజమూరి సుధాకర్ అధ్యక్షతన రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులకు జరుగు తున్న మోసాలు, అన్యాయాలు పై న్యాయం కోరుతూ తమ ఫిర్యాదులను ఈ సేవా కేంద్రానికి అందించి



వినియోగదారులు సేవలు అందుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ రమేష్ నాయక్, సివిల్ సప్లైయి డిఎం నర్సింగరావు, మైసా శ్రీనివాస్, జానీ, కల్లూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ పౌరసత్వ పిటిషన్ కొట్టివేత

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడంటూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. పిటిషనర్ తన ఆరోపణలకు తగిన ఆధారాలను కోర్టుకు సమర్పించలేకపోయారంటూ లఖ్‌నవ్ బెంచ్ పేర్కొంది. రాహుల్ గాంధీ బ్రిటన్‌లో ఓ కంపెనీని పెట్టారని, ఆ సందర్భంగా తనను తాను ఆయన బ్రిటిష్ పౌరుడినంటూ ప్రకటించుకున్నారని.. ఈ మేరకు ఆయనకు ఉన్న భారత పౌరసత్వాన్ని, ఎంపీ పదవిని రద్దు చేయాలంటూ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే రాహుల్‌పై ఆరోపణలకు సంబంధించిన అంశం ఇప్పటికే కేంద్రం వద్ద పరిశీలనలో ఉంది.

# టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఏడాదిలో సాగునీరు : మాజీ మంత్రి హామీ




## కోడూరు చౌరస్తాలో రైతులతో కలిసి మాజీ మంత్రి ధర్నా

(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : మహబూబ్‌నగర్ మండల పరిధిలోని కోడూరు చౌరస్తాలో నిర్వహించిన రైతు సదస్సు..ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. మంత్రి మాటలు ఆయన వ్యాఖ్యల్లో... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండుగ లెక్కన చేసారు. కెసిఆర్ హయాంలో పంటల సాగు పెంచారు.. భూమి విలువ పెరిగింది.. చెక్ డ్యాంలు కట్టారు.. చెరువులు నింపారు.అప్పుడు యూరియా కు కొరత లేదు.. కరెంటు సరిపడ ఇచ్చారు. ఇప్పుడు యూరియా కోసం రైతులు పంట పొలాలు వదిలి యూరియా కేంద్రాల వద్ద నిలబడుతున్నారు... కరెంటు లేక పంటలు ఎండుతున్నాయి.కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక వ్యవసాయం వదిలేసి బొంబాయి వలసలు వెళ్లే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుంది. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పింద్రు.కౌలు రైతులకు.. రైతు కూలీలకు డబ్బులు ఇస్తామని మోసం చేసారు. రైతులు పండించిన పంట కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో అహర్నిశలు కష్ట పడి పండించిన పంట ప్రైవేట్ కు తక్కువ ధరకు రైతులు అమ్ముకున్నారు. రైతులకు రైతు బంధు లేదు.. రైతు భీమా ప్రీమియం కట్టలేదు.. రైతు చనిపోతే డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింది. కర్వేన, ఉదండాపూర్ పూర్తి అయినవి మహబూబ్ నగర్ మండలానికి కర్వేనా నుంచి నీరు వచ్చేది. ఉదండాపూర్ నుంచి హన్వాడకు నీరు వచ్చేది. మన్యం కొండ వద్ద రోప్ వే.. ఇతర అభివృద్ధి పనులు నిలిపివేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఏడాది లోపు సాగు నీరు పొలాల్లోకి వచ్చేవిధంగా చేస్తాము. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసం ప్రజలకు చెప్పాలి.. ప్రభుత్వం చేసిన మోసం ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, రైతు కమిటీ మాజీ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మల్లు దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సుధా శ్రీ, పీ ఏ సీ ఎస్ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులూ రవీందర్ రెడ్డి, రాజ గోపాల్, చెన్నయ్య యాదవ్, అల్లాఉద్దీన్, రాఘవేందర్ గౌడ్, శ్రీనివాసులు, నర్సింహులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పులు నెత్తిన పడుతున్నాయి శీనన్న



(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) : కరెంటు సరిగ్గా రావడం లేదు..గంట గంటకు కోతలు పెట్టడం తో పొలాల్లో నీరు పారడం లేదు ..పంటలు ఎండుతున్నాయి..గతంలో మోటార్లు పెట్టిపోయి కూరగాయలు అమ్ముకోవడం.. మందులు..ఇంటి సరుకుల కోసం మహబూబ్ నగర్ పోయి వచ్చే వాళ్ళము..పోయి వచ్చే వరకు పొలం పారేది.. ఇప్పుడు కరెంటు లేక..నీళ్లు పరక పంటలు ఎండుతున్నాయి.. యూరియా కోసం తిప్పలు పడుతున్నాము..రైతు భరోసా ఇస్తే పంట ఖర్చులకు వచ్చేది..ఇప్పుడు అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నాము..ఇప్పుడు పంటలు ఎండుతున్నాయనే దిగులుతో ఉన్నాము..అప్పులు నెత్తిన పడుతాయి.

*మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో మహబూబ్ నగర్ మండలం పోతన్ పల్లి గ్రామానికి చెందిన చెర్ల కృష్ణయ్య, పోతన్ పల్లి గ్రామ రైతు*

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో వ్యవసాయ విధ్వంసం పై రైతు సదస్సు






వనపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వంలో దగాపడ్డ రైతులు మేల్కొనుటకు నేడు వనపర్తి పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో వనపర్తి పట్టణ టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పలూస రమేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో వనపర్తి పట్టణ మరియు వనపర్తి మండల రైతులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు రైతు సమితి అధ్యక్షులు సింగిల్ విండో అధ్యక్షులు ఉపాధ్యక్షులు రైతు కూలీలతో పెద్ద ఎత్తున రైతు నిరసన ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదేశించి టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ టిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు మాణిక్యం గారు మాట్లాడుతూ,ఆనాడు ఆంధ్ర పాలకుల చేతిలో తెలంగాణ రైతులకు పంట పొలాలకు నీరు ఇవ్వలేదని గోదావరి అప్పర్ కృష్ణ ప్రాజెక్టుల నుండి నీటిని సాధించి తీరుతానని రైతులు నీళ్లు లేక వలసలు వెళుతున్న పరిస్థితుల్లో కల్వకుంట్ల చంద్రశేఖర రావు డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమం చేసి కెసిఆర్ చచ్చుడో, తెలంగాణ వచ్చుడో, అనే నినాదంతో తెలంగాణ సాధించాడు.తెలంగాణ ఏర్పడ్డాక మిషన్ కాకతీయ ద్వారా అన్ని చెరువులు కూడిక తీసి ఎండాకాలంలో అన్ని చెరువులకు నీళ్లు నింపారు పాలమూరు రంగారెడ్డి కరువేన వట్టెం వంటిప్రాజెక్ట్ ల ద్వారా సస్యశ్యామలం చేయుటకు ప్రాజెక్టులు నిర్మించారు అలాగే రైతులకు రైతు బీమా ఐదు లక్షల రూపాయలు రైతుబంధు ఎకరాకు 10000 రూపాయలు రైతులకు ఉచితంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్తు వంటి పథకాలు చేసి రైతులకు మేలు చేశారు కేసీఆర్ గారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి వరంగల్ లో రైతు డిక్లరేషన్ పేద రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు రైతులకు రైతు బీమా రైతు భరోసా 12000 ఎకరాకు 500 బోనస్ రెప్పపాటి కరెంటు పోదన్నారు.

**రైతులకు వడ్డీ లేని రుణం ఇస్తాం అన్నారు ఇవ్వలేదు**

సమగ్ర పంట బీమా ఇవ్వలేదు చక్కెర ఫ్యాక్టరీ బంధు పసుపు బోర్డు చేస్తామన్నారు చేయలేదు. పోడు భూములకు అసైన్ భూములకు పట్టాలిస్తామన్నారు ఇవ్వలేదు కౌలు రైతుకు 15000 రైతు కూలీలకు 12000 ఇస్తామన్నారు.మేము అధికారంలో ఉన్నప్పుడు 127 మంది గిరిజనులకు పట్టాలిచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవి నెరవేర్చనందుకు ఈరోజు రైతులతో పెద్ద మొత్తంలో రైతు సదస్సులు ఏర్పాటు చేశాము.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి మార్క్ ఫైట్ డైరెక్టర్ విజయకుమార్ మున్సిపల్ కౌన్సిలర్ మెకానిక్ శీను మురళి సాగర్ శ్రీకర్ గౌడ్ బండారు కృష్ణ ప్రేమ్ నాథ్ రెడ్డి బొబ్బిలి ప్రేమ్ కుమార్ నీల స్వామి గులాం ఖాదర్ ఖాన్ ఉంగ్లం తిరుమల్ చిట్యాల రాము సుజాత దేవర్ల నరసింహ వెంకటేష్ సాగర్ పెండెం నాగన్న యాదవ్ గంధం విజయ్ కుమార్ రవి ప్రకాష్ రెడ్డి దేగ మహేశ్వర్ రెడ్డి జోయెబ్ ఎం బాలరాజు యుగంధర్ రెడ్డి హేమంత్ ముదిరాజ్ పానుగంటి రాము చీర్ల శ్రీనివాసులు, చీర్ల విష్ణు బుచ్య నాయక్ స్టార్ రహీం నందిమల్ల రమేష్ డి దానేలు సిరువాటి శంకర్ పోతులపల్లి రాజు మంద రాము కవిత అస్లాం ఆరిఫ్ ఖాదర్ శివ గౌడ్ లక్ష్మణ్ గౌడ్, రాజువర్ధన్ రెడ్డి ఇంతియాజ్ గొర్ల బాలయ్య సత్యం కరుణాకర్ ఎండి ఖాదర్ నందిమల్ల సుబ్బు వెంకటేష్ గౌడ్ కడుకుంట్ల తిరుపతయ్య పడుకుంట్ల బాలకృష్ణ ఉందే దేకోటి శివ సఫాయి కృష్ణయ్య కౌన్సిలర్ రమేష్ గౌడ్ డి జనార్ధన్ తదితరులు పాల్గొని రైతు సదస్సును విజయవంతం చేశారు.

## చిన్న చింతకుంటలో కదం తక్కిన గులాబీ సైన్యం



దేవరకద్ర : మహబూబ్ నగర్ జిల్లా. చిన్న చింతకుంట మండల కేంద్రంలో గురువారం నాడు కాంగ్రెస్ దగా పాలనపై దేవరకద్ర నియోజకవర్గ గులాబీ సైన్యం... కదం తొక్కింది. రైతులతో కలిసి చిన్నచింతకుంట మండల కేంద్రంలో భారీ ర్యాలీ ఆరు గ్యారెంటీలు,420 హామీలతో వంచించిన కాంగ్రెస్ పాలనపై సమరభేరి.. కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు కనిపించేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ప్రదర్శన కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చింతకుంట మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పాలన వైఫల్యాన్ని గులాబీ సైన్యం... ఎండ కట్టింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలకు గుర్తు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శన చేస్తూ...హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు... నినదించాయి.

## భాజపా ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశం



(సమయం ప్రతినిధి దేవరకద్ర) : రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశంలో భాజపా బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని. కావున ప్రతి ఒక్కరు కంకణా బద్ధులై ప్రతి ఒక్క ఓటర్ ని కలుసుకొని దేశం కోసం మోడీ చేసే అభివృద్ధిని వివరించి భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సమావేశంలో కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డోకూర్ పవన్ కుమార్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి గారు, వనపర్తి జిల్లా భాజాపా మాజీ అధ్యక్షుడు రాజావర్ధన్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా ఉపాధ్యక్షుడు భరత్ భూషణ్, ఉపాధ్యక్షుడు కురువ రమేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు డాబా శ్రీనివాస్ రెడ్డి, అన్ని మండలాల అధ్యక్షులు తదితర ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంపై బిజెపి నాయకులు ముట్టడి





మహబూబాబాద్ సెప్టెంబర్ 3 (వేకువ సమయం ప్రతినిధి): హైదరాబాదులోని బిజెపి కార్యాలయం పై దాడిని ఖండిస్తూ, ?మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంపై బీజేపీ నాయకులు తీవ్ర ఉద్రిక్తతతో ముట్టడించే ప్రయత్నం చేశారు. కార్యాలయం లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా భారీ బందోబస్తు దాదాపు 50 మంది పోలీసులు ఉన్న వారిని చేదిస్తూ ముట్టడించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ముట్టడించే ప్రయత్నంలో బిజెపి నాయకులకి పోలీసులకు గాయాలు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా 18 మండలాల నుంచి బీజేవైఎం నాయకులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలపై ఎమ్మెల్సీ కోదండరాముకు వినతి




హైదరాబాద్ : కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్ల వేతనాల పెంపు, నైట్ డ్యూటీల రద్దు, పనిభారం తగ్గింపు తదితర డిమాండ్లపై అసెంబ్లీలో చర్చించాలని, ప్రభుత్వంతో, అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ కోదండరామ్ కి వినతి పత్రం ఏ హైదరాబాద్. ప్రగతి శీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (TUCI) – తెలంగాణ రాష్ట్ర కమిటీ. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎల్ పద్మ, ఎం.సుధాకర్, TUCI రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, రాష్ట్ర నాయకులు కేఎస్ ప్రదీప్‌లు పాల్గొన్నారు.





# పెద్దమందడి-వనపర్తి రోడ్డు కోసం బీఆర్ఎస్ పాదయాత్ర...

## కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం టిఆర్ఎస్ నాయకులు



వనపర్తి : పెద్దమందడి మండల కేంద్రం నుంచి వనపర్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల యూనిట్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పెద్దమందడి మండలంలోని పలు గ్రామాల ప్రజలు వనపర్తికి రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి అధ్వానంగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం ఇచ్చారు. గతంలో ఈ రోడ్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.40 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ముఖ్యమంత్రి, వివిధ శాఖల మంత్రులు పలుమార్లు శంకుస్థాపనలు చేశారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అయితే పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు.రోడ్డు పనులు టెక్నికల్ సమస్యల కారణంగా ఆలస్యమయ్యాయని, తాజాగా పనులు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ ప్రతినిధులు చెబుతున్నప్పటికీ.. గతంలో పలుమార్లు పనులు ప్రారంభించి నిలిపివేసిన నేపథ్యంలో ప్రజలకు నమ్మకం కలగడం లేదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంటనే చొరవ తీసుకుని రహదారి పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

**పాదయాత్రకు నిరంజన్‌రెడ్డి సంఘీభావం**

బీఆర్ఎస్ నేతలు చేపట్టిన పాదయాత్రకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో కొద్దిదూరం నడిచారు. పెద్దమందడి-వనపర్తి ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## అశ్విని మృతి కలచివేసింది మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**కమ్మదనం గురుకుల పాఠశాలను సందర్శించిన అంజయ్య యాదవ్**



(సమయం ప్రతినిధి రంగారెడ్డి) : షాద్‌నగర్ నియోజకవర్గంలోని కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో గిరిజన విద్యార్థిని మూడవత్ అశ్విని మృతి చెందడం బాధాకరమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత వై. అంజయ్య యాదవ్ అన్నారు. ఈ సంద ర్భంగా అంజయ్య యాదవ్ ఈరోజు కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లా డి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థిని మృతి పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని, అశ్విని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. అశ్విని మృతికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అంజయ్య యాదవ్ కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు అవసరమైన మానసిక ధైర్యం, కౌన్సెలింగ్ అందిస్తూ వారి సమస్యలను తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అశ్విని కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మన్నె కవిత నారాయణ, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, సర్పంచ్ లత కిరణ్, మాజీ సర్పంచ్ నరసింహా, నాయకులు రాజు, రాఘవేందర్ రెడ్డి, గుడిసె బాలరాజు, అంజి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయలు ఇవ్వని సీఎం రాజీనామా చేయాలి



హైదరాబాద్ : ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే.అరుణ మ్మ,గౌతం రావు, BJYM అధ్యక్షులు గణేష్ కుండే, బండారు విజయలక్ష్మితో కలిసి సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల చెల్లింపుకై తా ము సేకరించిన సంతకాల పత్రాలతో సెక్రటేరియట్ ఎదుట నిరసన తెలుపుతుంటే, అరెస్ట్ చేసి గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించాలని వినతి పత్రం అందజేసేందుకు తా ము వెళ్తే పోలీసులు అడ్డుకోవడం అత్యంత దుర్మార్గం. ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే సీఎం రాజీనామా చేసి వెంటనే గద్దె దిగాలి! విద్యార్థుల ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు అప్పులపాలవు తున్నారు. కాలేజ్ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో మన యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. "ఫీజు బకాయి – బీజేపీ పడాయి" పేరుతో మేము ప్రతి కాలేజీకి వెళ్లి విద్యార్థుల సంతకాలను సేకరించాం. విద్యార్థుల పక్షాన బీజేపీ పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తుంది. ప్రభుత్వం బకాయిలు విడుదల చేస్తామని చెప్తే ఈ రచ్చంతా అవసరమే ఉండదని హితవు పలికారు.

## పదేళ్ల పాలనలో పది ఇండ్లు కూడా ఇవ్వని బీఆర్ఎస్..

### వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసనలు చేయడం హాస్యాస్పదం: ఎమ్మెల్యే జియంఆర్



దేవరకద్ర : కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా చిన్నచింతకుంట మండలంలో నిర్వహించిన భారీ సంబరాలు, బైక్ ర్యాలీలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) పాల్గొన్నారు.నెల్లికొండి గ్రామం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పెద్ద వడ్డేమాన్, చిన్న వడ్డేమాన్, ఎదులాపూర్ గ్రామాల మీదుగా చిన్నచింతకుంటకు చేరుకుంది. అనంతరం చిన్నచింతకుంట బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో ఎమ్మెల్యే జియంఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా జియంఆర్ గారు మాట్లాడుతూ, పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దగా చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలకు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రజలను దగా చేసిందని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపనా పోలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని నిరుపేదలను నిలువున ముంచిన బీఆర్ఎస్ నాయకులు నేడు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను నెరవేర్చిందని తెలిపారు.ఇచ్చిన మాట మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా 21 వేల కోట్ల రూపాయలతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.చిన్నచింతకుంట మండలంలోనే 6,475 మందికి కొత్త రేషన్ కార్డులు అందించామని, 5,760 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 8,144 మందికి రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని వివరించారు. అదేవిధంగా మండలంలోని 4,073 మంది రైతులకు రూ.32 కోట్ల 54 లక్షల రూపాయలతో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని తెలియజేశారు. దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఒక్క చిన్న చింతకుంట మండలంలోనే రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, రూ.110 కోట్లతో కురుమూర్తి స్వామి దేవస్థానానికి ఎలివేటెడ్ కారిడార్‌తో కూడిన ఘాట్ రోడ్డు, రూ.45 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేస్తుంటే, ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఎమ్మెల్యే జియంఆర్ గారు విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని డ్రామాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రజలు గత పాలనను, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకొని ఎంపీ, గ్రామ పంచాయతీ మరియు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించారని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు సీడ్ గణపతి.. మట్టి విగ్రహాలతో పర్యావరణహిత వినాయక చవితికి పిలుపు

కీసర, సెప్టెంబర్ 3 (వేకువ సమయం): వినాయక చవితి పర్వదినాన్ని పర్యావరణహితంగా నిర్వహించాలనే లక్ష్యంతో సీడ్ గణపతుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలోని గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ విత్తనాలతో కూడిన మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కీసర మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ గురువారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి సీడ్ గణపతి విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించని విధంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు.

**విగ్రహంతో పాటు మొక్కకు జీవం**

సీడ్ గణపతి ప్రత్యేకత ఏమిటంటే.. విగ్రహాన్ని మట్టితో తయారు చేయడంతో పాటు అందులో వివిధ రకాల మొక్కల విత్తనాలను ఉంచుతారు. వినాయక చవితి అనంతరం ఈ విగ్రహాన్ని ఇంటి వద్దే నీటిలో నిమజ్జనం చేసి, అందులోని విత్తనాలను మట్టిలో నాటడం ద్వారా మొక్కలను పెంచుకునే అవకాశం ఉంటుంది. దీంతో భక్తి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

**కాలుష్యానికి ప్రత్యామ్నాయంగా మట్టి గణపతులు**

వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వినియోగం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు చాలాకాలంగా సూచిస్తున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా మట్టి గణపతులను వినియోగించడం ద్వారా పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించవచ్చనే అవగాహనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సీడ్ గణపతి కార్యక్రమం ఉపయోగపడుతుందని



నిర్వాహకులు తెలిపారు. ప్రతి కుటుంబం పర్యావరణహిత గణపతిని ప్రతిష్ఠించి, నిమజ్జనం అనంతరం విత్తనాలను నాటి మొక్కగా పెంచితే పండుగకు మరింత అర్థవంతమైన ముగింపు లభిస్తుందని పేర్కొన్నారు. "వినాయకుడిని పూజించడంతో పాటు ఆయన విగ్రహం ద్వారా ఒక మొక్కను పెంచడం" అనే సందేశంతో ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు. కీసరలో సీడ్ గణపతి పంపిణీ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడంతో పాటు, రాబోయే వినాయక చవితిని పచ్చదనానికి ప్రతీకగా నిర్వహించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

# బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి పలు కుటుంబాలు

**దేవరకొండ:పీఏ పల్లి: సెప్టెంబర్ 3 (సమయం ప్రతినిధి) :**పీఏ పల్లి మండలం అజ్మాపురం గ్రామ పరిధిలోని కొట్టాలగడ్డ తండాలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. లిబీఆర్ఎస్ పార్టీలో ఉన్న సమయంలో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, తమ సమస్యలను పట్టించుకునే నాయకుడు కూడా లేకపోయేవారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. తమ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు.

**ప్రజా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: బాలు నాయక్**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలికారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ కొట్టాలగడ్డ తండాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అందరూ ఐక్యతతో, సమన్వయంతో పనిచేసినప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని పటిష్టంగా ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, గ్రామాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.



**కాంగ్రెస్‌లో చేరిన పలు కుటుంబాల ప్రతినిధులు :** జాటావత్ మోహన్, కత్తుల రవీందర్, కత్తుల అరుణ, జటావత్ రేణుక, జటావత్ శ్రీరామ్, జటావత్ లలిత, జటావత్ బాబురావు, జటావత్ చిట్టి, జటావత్ రాము, జటావత్ సింధు, జటావత్ జై రామ్, జటావత్ రోజా, తదితరులు ఎమ్మెల్యే బాలు నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయొక్క కార్యక్రమంలో చందంపేట మండల అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, నేరేడుగొమ్ము మండల అధ్యక్షుడు బిక్కు నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సన్నాయిల ఉమామహేశ్వర్, శివర్ల శ్రీనయ్య, సుక్కు నాయక్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## బిజ్వారం అంగన్వాడి సెంటర్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామంలో 4వ. అంగన్వాడీ కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ చిన్నారులకు శ్రీకృష్ణుడు, రాధిక వేషధారణలు వేయించి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధిక వేషాల్లో అలరించారు. అంగన్వాడీ సిబ్బంది పిల్లలకు శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ విశిష్టతను వివరించారు. చిన్నారుల వేషధారణలు, వారి సందడి తల్లిదండ్రులు మరియు అంగన్వాడీ సిబ్బందిని ఆకట్టుకున్నాయి. పండుగ సందర్భంగా పిల్లలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, మిఠాయిలు పంపిణీ చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ వ్యతిరేకి



దేవరకొండ: సెప్టెంబర్ 3 (సమయం ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండ సురేఖ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్ కు లేఖ పంపడాన్ని ఉపసంహరించుకోవాలి లేకపోతే రాష్ట్ర వ్యాప్త బిసి ఉద్యమం ఉధృతం చేస్తాం. సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక. తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలి నుండి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని గవర్నర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాయడం బీసీలకు ద్రోహం చేసినట్లే అని సామాజికవేత్త , బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీల ద్రోహిగా చరిత్రలో మిగిలి పోయే విధంగా బీసీలకు ద్రోహం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చరిత్రలో బీసీల ద్రోహిగా, బీసీల నిష్పక్ష పార్టీగా ప్రజా సంగ్రామంలో నిలదీసేటటువంటి అవకాశం వచ్చిందని, బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగకుండా మాకు రావాల్సినటువంటి వాటా రాష్ట్ర ప్రభుత్వంలో రాజకీయంగా దక్కకుండా అగ్రవర్ణాలకు రాజకీయ పదవులు కట్టబెట్టడానికి మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయడాన్నీ ఆదేశాలు జారీ చేయడాన్నీ ఖండిస్తున్నాము. కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వాలు బీసీలకు అనుకూలంగా ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కొండా సురేఖ కూతురు సుస్మిత పటేల్ చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, రేవూరి ప్రకాష్ రెడ్డి మళ్లీ పరకాల నియోజకవర్గం లో ఎమ్మెల్యే అవుతారాని, నేనే 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రినని అవుతానని అనడం పార్టీ ధిక్కరణ కాదా, తెలంగాణ నీ జాగీరా నీవి అనుచిత వ్యాఖ్యలు కావా, మీకో న్యాయం మాకు న్యాయమా బీసీల మొత్తం తలుచుకుంటే మీ ముఖ్యమంత్రి సీటు కూల్చుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ కోటేశ్వర్, పున్న వెంకటేష్ నేత, పున్న బిక్షమయ్య, నటువ సుధాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐక్యంగా తరలిరావాలి**
**TGEJAC రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. రామారావు పిలుపు**

సమయం: సెప్టెంబర్ 3, రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 10న తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (TGEJAC) ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా TGEJAC చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. రామారావు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా TGEJAC ఆధ్వర్యంలో కొంగరకలాన్‌లోని IDOCలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా TGEJAC కన్వీనర్ డా. రామారావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగో తరగతి ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు ఐక్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ వర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ ఎం. శ్రీను, కో-చైర్మన్లు గోపాల్, రమేష్, డేవిడ్, గోపాల్ జి., శాంతిశ్రీ, వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, జమ కుశాల్, మల్లారెడ్డి, రంగయ్య, గోపాల్, వెంకటస్వామి, పరమేష్, మహేష్, సంతోష్, ప్రమీల, రాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 3: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం తాడూర్ మండలం యంగంపల్లి గ్రామంలో గురువారం జరిగింది.యంగంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ కొండలరావు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఎన్నో సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.రేషన్ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకులు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో యంగంపల్లి గ్రామ ఉపసర్పంచ్ సత్యం,గ్రామ పంచాయతీ సెక్రటరీ నరసింహులు,ఈజీఎస్ అధికారులు ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆలూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**



జడ్చర్ల సెప్టెంబర్ 3, సమయం ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు మరింత సౌకర్యవంతంగా ప్రభుత్వ సేవలు అందనున్నాయని అన్నారు. ఆలూరు గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దివ్య ఖురాన్ సర్వ మానవాళికి మార్గదర్శకం



ఆత్మకూర్ : దివ్య ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని ప్రతి ముస్లిం నిత్యం కురాన్ పఠనం చేయాలని మదర్సా ఈమాదుల్ ఉలుమ్ ప్రిన్సిపల్ మౌలానా జియా ఉర్ రహమాన్, హెడ్మాస్టర్ షేక్ రఫీయుద్దీన్ అన్నారు. గురువారం పట్టణంలోని అరబ్బీ పాఠశాలలో దివ్య ఖురాన్ పఠనం పూర్తిచేసిన ఆఫీస్ సయ్యద్ మెహబూబ్ కు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త దివ్య సూక్తులను బోధించారు. దివ్య ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలన్నారు. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలై వసల్లం సూక్తులను పాటించాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, ప్రతినిత్యం ఐదు పూటలు నమాజ్ ఆచరించాలని, దానధర్మాలు చేయాలని, ప్రతి ఒక్కరితో గౌరవపూర్వకంగా మెలగాలని సూచించారు. అనంతరం ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఉబేద్ ఉర్ రహమాన్ తమీమ్, ముక్తార్, సల్మాన్, ఆఫ్రిది, స్థానికులు ఖాజా, మహమ్మద్, సయ్యద్, గౌస్, ఇలియాస్, ఫెరోజ్, ఖాజా హుస్సేన్, అక్బర్, రఫీ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# రైతుల గురించి పట్టించుకోని ప్రభుత్వం : మాజీ మంత్రి







(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) : కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కోస్గి మున్సిపల్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో మాజీ మంత్రులు వి శ్రీనివాస్ గౌడ్, సబిత ఇంద్రారెడ్డి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. యూరియా కొరతతో రైతులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతుభరోసా, రైతుబీమా, సాగునీటి రంగాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి రైతులకు అండగా నిలిచామని గుర్తుచేశారు.

## రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షునిగా బంక మోహన్ రెడ్డి ఎన్నిక



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 3 : రెడ్డి జాగృతి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షునిగా బంక మోహన్ రెడ్డిని రాష్ట్ర రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెం గారి మాధవరెడ్డి నియమించినట్లు మోహన్ రెడ్డి తెలిపారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షునిగా నియమించి నందుకు రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో రెడ్డి జాగృతి వ్యవస్థ కోసం మరింత కృషిచేసి బడుగు బలహీన వర్గాల వారికి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు.

## యూటర్న్‌ను తిరిగి ఓపెన్ చేయాలి: డీసీపీ రాహుల్ రెడ్డికి వినతి



వేకువ సమయం సెప్టెంబర్ 3 కీసర ప్రతినిధి : నాగారం డివిజన్ పరిధిలో మూసివేసిన యూటర్న్‌ను తిరిగి తెరవాలని కోరుతూ మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. యూటర్న్ మూసివేతతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డీసీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై రాహుల్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించిన అనంతరం యూటర్న్‌ను తిరిగి తెరవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఘనపురం కొండల్ రెడ్డి, గూడూరు కృష్ణ గౌడ్, సెరినిటీ స్కూల్ ప్రిన్సిపల్ నోముల జంగి రెడ్డి, సుబ్బారావు, దాసోహం నర్సింగ్ రావు, దాసరి రాంరెడ్డి, పంగా సంతోష్, బుల్లబోయిన ప్రవీణ్ యాదవ్, మామిళ్ల శేఖర్ యాదవ్, షేక్ గౌస్, కిష్టాన్న రవి, మహమ్మద్ తాలీం, సత్యం గౌడ్, మిడాల సతీష్, మనోహర్ చెల్లా, సింహపురి కాలనీ అధ్యక్షుడు మహేష్‌తో పాటు పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పదవి విరమణ అభినందన సభ
## తెలుగు ఉపాధ్యాయురాలు ఎర్ర వెంకటమ్మ కి ఘనంగా వీడ్కోలు



దేవరకొండ: పీఏ పల్లి: సెప్టెంబర్ 03(సమయం ప్రతినిధి) : పీ.ఏ.పల్లి మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తెలుగు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న ఎర్ర వెంకటమ్మ పదవీ విరమణ . గురువారం స్థానిక ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో టి పి సి సి ఎస్ సి డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ ఏకల రాజారావు పాల్గొని మాట్లాడుతూ వెంకటమ్మ ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో, అంకితభావంతో పనిచేశారని, ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని తెలుగు భాషపై ఆమెకున్న మక్కువ, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయత ఎప్పటికీ మరువలేనిదని డాక్టర్ రాజారావు అన్నారు. అనంతరం ఆమెను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి మేమెంటో అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యేకుల సురేష్, మాల మహానాడు కొండమల్లెపల్లి మండల అధ్యక్షులు అన్ని మల్ల సురేష్, చేపూరి మురళి, గ్రామ సర్పంచ్, వివిధ హోదాలో ఉన్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను దగా చేసిన కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ యుద్ధభేరి

**కీసరలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా.. హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ శ్రేణులు**





వేకువ సమయం సెప్టెంబర్ 3 కీసర ప్రతినిధి : రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ..బీఆర్ఎస్ పార్టీ నిరసన బాట పట్టింది. ఇందులో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర మండల కేంద్రంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని నాయకులు విమర్శించారు.

**హామీల అమలులో ప్రభుత్వం విఫలం :** ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో కీసర మండల కేంద్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. “జై తెలంగాణ.. జై కేసీఆర్” అంటూ నినాదాలతో బీఆర్ఎస్ కార్యకర్తలు తమ నిరసనను వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భవిష్యత్‌లోనూ ఆందోళనలు కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## అవినీతి కాదు.. ప్రజల ప్రేమే నా సంపాదన
## నస్రుల్లాబాద్ అభివృద్ధికి రూ.కోటి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామన్న హామీ**

జడ్చర్ల సెప్టెంబర్ 3, సమయం ప్రతినిధి: ప్రజల ప్రేమ, నమ్మకమే తన సంపాదన అని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. జడ్చర్ల మండలం నస్రుల్లాబాద్‌లో గురువారం స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో గ్రామంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని ప్రజలు మరిచిపోరన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిందే సంపాదించుకోవడానికి కాదని, ప్రజల ప్రేమను సంపాదించుకోవడానికేనని చెప్పారు. గతంలో తనపై గ్రామంలో దాడి జరిగినప్పటికీ వ్యక్తిగత కక్షలకు తావివ్వకుండా నస్రుల్లాబాద్ అభివృద్ధికి సుమారు రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ చెరువును అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

**జడ్చర్లకు ట్రిపుల్ ఐటీ**

నియోజకవర్గానికి రూ.400 కోట్లతో ట్రిపుల్ ఐటీ మంజూరు కావడం గర్వకారణమన్నారు. విద్యారంగంలో జడ్చర్ల అభివృద్ధికి ఇది కొత్త అధ్యాయమని పేర్కొన్నారు. అలాగే మాచారం నుంచి మహబూబ్‌నగర్ వరకు బైపాస్ రహదారి నిర్మాణానికి రూ.600 కోట్ల నిధుల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.



**24 సబ్‌స్టేషన్లు మంజూరు**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో సుమారు 30 సబ్‌స్టేషన్లు మంజూరైతే, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత 24 సబ్‌స్టేషన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు.

## వృద్ధురాలిని ఎత్తుకున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 03: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తైన సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు విధ్వంస నిరసన కార్యక్రమంనిర్వహించారు. ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని ఎదులాబాద్ గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ముసలవ్వను తన భుజాలపై ఎత్తుకుని ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా వినూత్న రీతిలో నిరసన తెలిపి అందరి దృష్టిని ఆకర్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మల్లారెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ పాలనలో అన్నదాతలు సుభిక్షంగా ఉన్నారని గుర్తుచేశారు. తెలంగాణను అన్నపూర్ణ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ప్రశంసించారు. వ్యవసాయానికి ఉచిత కరెంట్, సాగునీరు, ఎరువులతో పాటు రైతుబంధు, రైతు బీమా వంటి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపారని మల్లారెడ్డి తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతుల కళ్లల్లో కన్నీళ్లు తప్ప ఏమి లేవని మల్లారెడ్డి మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు ఇలా ప్రతి ఒక్క వర్గాన్ని కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని ధ్వజమెత్తారు. సంక్షేమాన్ని గాలికొదిలేసిన ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మల్లారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల్లో దేవరకద్ర నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధిని కార్యక్రమాలు చేశాం : ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR)







దేవరకద్ర : కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా చిన్న చింతకుంట, కౌకుంట్ల దేవరకద్ర మండలాలలో నిర్వహించాయి. భారీ సంబరాలు, బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అనంతరం చిన్న చింతకుంట, కౌకుంట్ల, దేవరకద్రలో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే జియంఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం హయాంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు _న్నామని అన్నారు. పదేళ్లలో బిఆర్ఎస్ చేయలేని ఎన్నో పనులను మేము వెయ్యి రోజుల్లో చేసి చూపించామని అన్నారు.

**బ్రహ్మోస్ యూనిట్ కోసం 416 ఎకరాలు**

దేవరకద్రలో రక్షణ రంగ పరిశ్రమకు ఏర్పాటు చేసేందుకు బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ ఏర్పాటుకు 416 ఎకరాల భూమిని ఉచితంగా రక్షణ శాఖకు ఇస్తున్నట్లు తెలియజేశారు. బ్రహ్మోస్ యూనిట్ దేవరకద్రకు వస్తే మన ప్రాంత రూపురేఖలు మారడంతో పాటు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి, కోర్టు ఏర్పాటు చేసాం, దేవరకద్రను మున్సిపాలిటీగా చేశాం. దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణాలు జరుగుతున్నాయని, గత పదేళ్ల పాలనలో వైద్య రంగాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. విద్య పరంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం దేవరకద్ర నియోజకవర్గంలో డిగ్రీ కాలేజ్, చిన్నచింతకుంట మండలంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయలేదని, మన ప్రజా ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో దేవరకద్రలో డిగ్రీ కాలేజ్, చిన్నచింతకుంట లో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేశామని తెలిపారు. దేవరకద్రకు అండర్‌పాస్ కోసం కృషి. రైల్వే/రోడ్డు మార్గం కారణంగా దేవరకద్ర ప్రాంతం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు అండర్‌పాస్ ఏర్పాటుకు అధికారులతో నిరంతరం చర్చలు జరిపి దేవరకద్ర కు సబ్వే మంజూరు చేయించామని తెలిపారు, త్వరలో సబ్వే నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయని తెలియజేశారు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం. పదేళ్ల బిఆర్ఎస్ పాలన లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, చిన్న చింతకుంట, దేవరకద్ర, కౌకుంట్ల లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. నియోజకవర్గంలో 28 వేల రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చామని, ఒక్క దేవరకద్ర పట్టణంలోనే 77 ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దగా చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలకు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రజలను దగా చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను నెరవేర్చిందని తెలిపారు. ఇచ్చిన మాట మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా 21 వేల కోట్ల రూపాయలతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జీర్ణించుకోలేక, ఫ్రస్టేషన్కు గురవుతున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలు గత పాలనను, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకొని ఎంపీ, గ్రామ పంచాయతీ మరియు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ను చిత్తుగా ఓడించారని తెలిపారు.





## ఎస్సీ, ఎస్టీ కులాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత, అర్హత కలిగిన వారికి బెస్ట్ అవైలబుల్, ఉన్నత విద్య అమలు : జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ సెప్టెంబర్ 3 (వేకువ సమయం ప్రతినిధి): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కమిటీ చైర్పర్సన్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం (పి ఓ ఏ ఆక్ట్) కింద నమోదైన కేసుల పురోగతి, బాధితులకు అందాల్సిన పరిహారం, కేసుల దర్యాప్తుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధితులకు తక్షణ సహాయం: ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన నష్టపరిహారం, పెన్షన్ , ఇతర సంక్షేమ ఫలాలను ఆలస్యం లేకుండా వెంటనే అందించాలని,రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కేసుల పరిష్కార వేగాన్ని పెంచాలని ,క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు , ఇతర అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి ప్రభుత్వం అందిస్తున్న చట్టపరమైన రక్షణలపై అవగాహన సదస్సులు నిర్వహించాలనీ, జిల్లాలో 51% ఎస్సీ ఎస్టీలు ల జనాభా ఉందని జనాభా ప్రాతిపదికన వారికి అందాల్సిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు, కొత్తగా నోటిఫికేషన్లు జారీ చేసిన అంగన్వాడీ పోస్టులు, తదితర విభాగాలలో ఆర్ఓఆర్ రోస్టర్ పాయింట్ కచ్చితంగా అమలు చేయాలని, కార్యాలయాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలతో పాటు అన్ని వసతి గృహాలలో కచ్చితంగా పక్కా డైట్ మెనూ పాటించాలని, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు కేటాయించిన వసతి గృహాలలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. భూ సమస్యలు, అంబేద్కర్ ఓవర్సీస్ స్టడీ, బెస్ట్ అవైలబుల్ స్కీమ్స్, కార్పొరేట్ ఇంటర్ విద్య తదితర పథకాలలో అర్హులైన వారికి కచ్చితంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రజావాణి కార్యక్రమాలలో ప్రత్యేకంగా న్యాయ సేవల కోసం కౌంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా కూడా ఎస్సీ ఎస్టీ, అన్ని వర్గాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.కొత్తగా నియామకమైన కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో అన్ని పరిస్థితులను గమనిస్తూ ఉండాలని ఏమైనా సమస్యలు ఉంటే కమిటీ దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించే విధంగా ముందుకు సాగాలని సూచించారు, అందరూ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వేగవంతమైన నమోదైన కేసుల్లో ఎస్డీపివో/డిఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత న్యాయస్థానాల్లో సకాలంలో ఛార్జిషీట్ దాఖలు చేయాలని, నిష్పక్షపాత విచారణ: ప్రతి కేసులోనూ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు చట్టపరంగా తగిన న్యాయం జరిగేలా చూడాలనీ,ముందస్తు చర్యలు: సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రతి మాసం జరిగే క్రైమ్ మీటింగ్లో ప్రత్యేకంగా ఎస్సీ ఎస్టీ కేసుల గురించి చర్చించి వేగవంతంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతిరావు, కమిటీ సభ్యులు, గుగులోతు కిషన్ నాయక్, పంజా కల్పన, గొల్లపల్లి రజనీకాంత్, పులుసం పుష్పలత, గూగులోత్ దేశీ రామ్ నాయక్, పి.రాజేంద్రప్రసాద్, రజిత, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం



మహబూబాబాద్ సెప్టెంబర్ 3 (వేకువ సమయం ప్రతినిధి): గురువారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మహబూబాబాద్ పట్టణంలోనీ హనుమంతుని గడ్డ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్, పద్మశాలి భవన్, పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు నోటీసులు అందించడం కొనసాగుతుందని, అందించిన నోటీసులకు సంబంధించి (11) రకాల గుర్తింపు కార్డులను సంబంధిత బూతు లెవల్ అధికారులకు అందజేసి తమ ఓటును పరిరక్షించుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ ప్రకారం సంబంధిత సిబ్బంది విధులు నిర్వహించాలని ప్రతిరోజు ఆన్లైన్లో నివేదికలను అప్లోడ్ చేయాలని, ఇంకా రాని నోటీస్ అందుకున్న ఓటరు కు స్వయంగా కానీ ఫోన్ ద్వారా కానీ సమాచారం అందించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సంబంధిత బూతు లెవల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేశ్వరి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉపేందర్, ఉప తాహసిల్దార్ నాగరాజు, రాజు, తదితరులు ఉన్నారు.

## అమరచింత 6వ వార్డులో సీసీ రోడ్ల పనులను పరిశీలన చేసిన కాంగ్రెస్ నాయకులు



(సమయం ప్రతినిధి అమరచింత) : పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగాలి... TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు... అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధికి మంజూరైన రూ.15 కోట్ల నిధుల్లో భాగంగా 6వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను అమరచింత మండల కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అమరచింత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న డాక్టర్ వాకిటి శ్రీహరికి ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపాలిటీ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. రవికాంత్ , 6వ వార్డు కౌన్సిలర్ ఎరుకలి రాములు, మార్కెట్ డైరెక్టర్ కమలాకర్ గౌడ్, మండల నాయకులు మహిపాల్ , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎవరికోసం ఈ 'వందేమాతరం'?

సమయం ప్రతినిధి : ప్రముఖ బెంగాలీ కవి బంకించంద్ర 1870వ సంవత్సరంలో 'ఆనంద మఠ్' నవలలో ఆరు చరణాల వందేమాతరం గీతాన్ని రచించారు. బెంగాల్‌లోని శాక్తేయ తాత్త్విక చింతన, శక్తిపూజ, కాళికాదేవి ఆరాధన, రామకృష్ణ పరమహంస బోధనలే గాక శంకరాచార్య విరచిత 'లలితా సహస్రనామ' శ్లోకాల ప్రభావంతో దేశమాతను శక్తిస్వరూపిణిగా ఆరాధిస్తూ, కీర్తిస్తూ శిష్ట బెంగాలీ, సంస్కృత పదాలతో ఆ గీతాన్ని రచించారు. చివరి నాలుగు చరణాలలో మహిషాసుర మర్దని, దుర్గామాత, కాళికాదేవి, లక్ష్మి, సరస్వతి దేవతల ప్రతీకలను, సంకేతాలను విరివిగా భక్తి ప్రపత్తులతో శ్లాఘించారు. ఈ నాలుగు చరణాలు జైనం, బౌద్ధ, సిక్కు, ముస్లిం మతాల వారికే గాక కమ్యూనిస్టులకు, నాస్తికులకు, ఆర్యసమాజం, బ్రహ్మసమాజంలోని వారికి కూడా ఆమోదయోగ్యంగా ఉండవన్న విశాల ఉదార భావనలతో మొదటి రెండు చరణాలనే ఆనాటి కాంగ్రెసు పార్టీ 1937లో జాతీయ గేయంగా నిర్ణయం చేసింది.స్వాతంత్ర్యం అనంతరం 1950లో 'రాజ్యాంగ సభ' దేశాన్ని గణతంత్ర రాజ్యంగా ప్రకటించడంతో పాటు ఈ గీతంలోని రెండు చరణాలను 'జాతీయ గేయం'గా నిర్ణయించింది. ఈ తీర్మానాన్ని ఆమోదించిన వారిలో గాంధీ, నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్‌లతో పాటు పటేల్, రాజేంద్రప్రసాద్, మదన్‌మోహన్ మాలవీయ, శ్యాంప్రసాద్ ముఖర్జీలు కూడా ఉన్నారు. నాటి నుంచి నేటి వరకు అన్ని పార్టీలు, వర్గాలు, మతాల వారి ఆమోదముద్ర ఆ తొలి రెండు చరణాలకు లభించింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీన కేంద్ర హోంశాఖ మొత్తం ఆరు చరణాలను అందరూ ఆలపించాలని సర్క్యులర్ జారీ చేయటమేగాక, ఆ గేయానికి తగ్గట్లు మార్చింగ్ సాంగ్, సంగీత వాయిద్య పరికరాలు-అంటే డ్రమ్ రోల్స్, ట్రంపెట్, మేళతాళాలు ఉండాలని విధివిధానాలను విడుదల చేసింది. ఈ పద్ధతి అంతా దసరా పండగ రోజు ఆరెస్సెస్ వారి కవాతును తలపించేటట్లు ఉంది. మొత్తం ఆరు చరణాలను పాడని వారందరూ దేశద్రోహులనీ, జాతి వ్యతిరేకులని ముద్రవేస్తున్నారు. ఈ లెక్కన రాజ్యాంగసభలో మొదటి రెండు చరణాలను ఆమోదించిన పటేల్, శ్యాంప్రసాద్ ముఖర్జీ కూడా నేటి బీజేపీ నాయకుల దృష్టిలో కొత్తగా దేశద్రోహులైనారు. రాజ్యాంగాన్ని రచించిన 'రాజ్యాంగ సభ' కన్నా పార్లమెంటు, మంత్రివర్గం గొప్పది కాదన్న సత్యాన్ని బీజేపీ నాయకులు తెలుసుకోవాలి. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, దేశంలో 20శాతం మంది ప్రజలు ఇంకా నిరక్షరాస్యులే. ఇటువంటి భారతంలో కఠినమైన సంస్కృత పదాలు మేళవించిన వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించడం పామరులకే కాదు, పండితులం అనుకునే వారికి కూడా 'ఇనుప గుగ్గిళ్లను' నమలడం లాంటిదే. ప్రజాప్రతినిధులు చాలా మంది తెలుగులో ప్రమాణ స్వీకారం చేసే సందర్భంలో 'సార్వభౌమాధికారం' అన్న పదాన్ని ఉచ్చరించడంలో తికమకకు గురికావడం తెలిసిన సంగతే.

సమయం
శుక్రవారం 04 సెప్టెంబర్ 2026




మహిళల భావోద్వేగాలకు ప్రాధాన్యమిచ్చే చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఏడుగురు మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. హ్యాపీ జర్నీ' మూవీని ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 18న థియేటర్లలో విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో విమానాశ్రయం బ్యాక్‌డ్రాప్‌లో చిత్రంలోని ప్రధాన తారాగణం అంతా సందడిగా, సరదాగా కనిపిస్తున్నారు. ట్రావెల్ బ్యాగులు, బ్యాక్‌గ్రౌండ్‌లో విమానం, పేపర్ ప్లేన్ మోటిఫ్ సినిమాకు సంబంధించిన ట్రావెల్ థీమ్‌ను హైలైట్ చేస్తున్నాయి. ఈ పాత్రలు సాగించే ప్రయాణం వారి జీవితాలపై చెరగని ప్రభావాన్ని చూపించబోతోందనే విషయాన్ని సూచిస్తోంది. హ్యాపీ జర్నీ' కేవలం విదేశీ ప్రదేశాలకు చేసే ప్రయాణం గురించి మాత్రమే కాదు. ఇంటర్నేషనల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతూనే, ఈ సినిమా రిలేషన్‌షిప్స్, ఎమోషన్స్, వ్యక్తిగత అనుభవాలు, ఒకే ప్రయాణంలో ఏర్పడే బంధాలను ఆవిష్కరిస్తుంది. విభిన్నమైన పాత్రలను కథకు కేంద్రంగా తీసుకుని, భిన్నమైన కోణాలను చూపించడంతో పాటు, అందరికీ కనెక్ట్ అయ్యేలా ఎమోషనల్ కోర్‌ను సహజంగా చూపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా హార్ట్‌వార్మింగ్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. విడుదల తేదీ ఖరారు కావడంతో మేకర్స్ ప్రమోషన్స్‌ను మరింత ముమ్మరం చేసి, సినిమాపై బజ్‌ను మరింత పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి శేఖర్‌చంద్ర సంగీతం అందిస్తున్నారు.




చలమలశెట్టి సునీల్ సమర్పణలో సతీష్ జై, ఫర్నాజ్ శెట్టి ప్రధాన పాత్రల్లో డా. మైత్రి శరణ్ నిర్మించిన చిత్రం 'గజ'. సతీష్ జై దీనికి దర్శకత్వం వహించారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాని మైత్రి మూవీస్ తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ క్రమంలో గురువారం అల్లకల్లోలంగా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి ప్రముఖ దర్శకుడు సాయి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సాయి రాజేశ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా టీజర్ ఇంప్రెసివ్‌గా అనిపించింది. నాకు సతీష్‌తో ఎన్నో ఏళ్ల నుంచి బంధం ఉంది. ఎన్ని సవాళ్లు ఎదురైనా కూడా ఈ సినిమాని వదల్లేదు. కష్టపడి ఈ స్థాయికి తీసుకు వచ్చాడు. రామ్ మిర్యాల వాయిస్ అంటే నాకు ఇష్టం. మణిశర్మ గారిని, రామ్ మిర్యాలని కలిపి క్రెడిట్ తీసుకోవాలని అనుకున్నాను. కానీ ఆల్రెడీ సతీష్ ఆ క్రెడిట్ తీసుకున్నాడు. మళ్లీ మేం ముగ్గురం కలిసి ఓ గొప్ప పాటను చేయాలని అనుకుంటున్నాను. ఫర్నాజ్ గారు తెలుగులో చక్కగా మాట్లాడారు. మణిశర్మ గారితో నాకు ఎన్నో బెస్ట్ మెమోరీస్ ఉన్నాయి. ఇకపై నేను మణి సార్‌తోనే ట్రావెల్ చేస్తాను. ఆయన ట్రాక్ క్వాలిటీని కూడా ఎవ్వరూ బీట్ చేయలేరు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. సతీష్ జై మాట్లాడుతూ, 'ఈ సినిమా కథను ముందుగా మిట్టపల్లి గారికి చెప్పాను. మణిశర్మగారు మ్యూజిక్ అని చెప్పడంతో మిట్టపల్లి గారు మరింత ఎగ్జైట్ అయ్యారు. ఈ సినిమాకి, నాకు మణిశర్మ గారు బ్యాక్ బోన్‌లా నిలిచారు. ఆయన్నుంచి నేను క్రమశిక్షణ, డెడికేషన్ గురించి తెలుసుకున్నాను. సాయి రాజేష్ గారు ఎప్పుడూ ఓ ఫ్రెష్ కంటెంట్‌ని తీసుకుంటారు. సాయి రాజేష్ గారికి మంచి మ్యూజిక్ టేస్ట్ ఉంటుంది. ఈ రోజు మా కోసం ఆయన రావడం సంతోషంగా ఉంది. ఫర్నాజ్ మంచి నటి. ఈ సినిమాకి ఫర్నాజ్ హీరో. కమర్షియల్ అంశాలతో పాటు సెల్యూట్ కొట్టేలా మంచి మెసెజ్, ఎమోషన్ కూడా ఉంటుంది. క్లైమాక్స్ చూసి కంటతడి పెట్టుకుని థియేటర్ నుంచి బయటకు వస్తారు. నా భార్య మైత్రి శరణ్ నాకంటే చాలా ఫేమస్. ఆమె నాకు స్ఫూర్తి. సెవెన్ హిల్స్ సతీష్ నాకు ఎప్పుడూ సపోర్ట్ చేస్తూ ఉంటారు. మా సినిమాని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. మణిశర్మ మాట్లాడుతూ, 'మా సతీష్ 'గజ' సినిమాని ఎన్నో కష్టాలు, సవాళ్లని ఎదుర్కొని చేశాడు. మూవీ అద్భుతంగా వచ్చింది. 'అల్లకల్లోలంగా' ట్యూన్ అద్భుతంగా కుదిరింది. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. నిర్మాత మైత్రి శరణ్ మాట్లాడుతూ, 'మా సినిమా టీజర్ అందరికీ నచ్చింది. అంతటి ఆదరణ లభిస్తుందని మేం కూడా ఊహించలేదు. కంటెంట్ బాగుంటే చిన్న సినిమానా? పెద్ద సినిమానా? అన్నది ఆడియెన్స్ చూడటం లేదు. మాకోసం ఈ రోజు సాయి రాజేష్ గారు రావడం, సాంగ్ లాంచ్ చేయడం ఆనందంగా ఉంది.




ఇండియాస్ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్స్‌లో సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న 'వారణాసి' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. దాదాపు రూ. 1400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటోన్న ఈ విజువల్ వండర్‌తో ఇటు మహేష్‌కు కూడా గ్లోబల్ వైడ్‌గా గుర్తింపు రావడం ఖాయం. అయితే 'వారణాసి' తరువాత జక్కన్న ఏ హీరోతో సినిమా తెరకెక్కిస్తాడనే దానిపై సినిమా ఫ్యాన్స్ చాలా ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. కెరీర్‌లో ప్రతి ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా మలచడంలో జక్కన్న దిట్ట అనే చెప్పాలి. 'బాహుబలి' కోసం దాదాపు ఐదేళ్లు, 'ఆర్.ఆర్.ఆర్' కోసం మరో ఐదేళ్లు కేటాయించిన ఆయన.. ఇప్పుడు మహేష్ బాబుతో తెరకెక్కిస్తోన్న 'వారణాసి' ప్రాజెక్ట్ కోసం కూడా అదే స్థాయిలో శ్రమిస్తున్నారు. పూర్తి ఐమాక్స్ కెమెరాలతో రూపొందుతున్న ఈ బిగ్గెస్ట్ అడ్వెంచర్ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒక్కో సినిమాకు రాజమౌళి తీసుకుంటున్న సమయం చూస్తుంటే.. ఆయనతో సినిమా చేయాలని కలలు కనే స్టార్ హీరోల జాబితా చాలా పెద్దదే ఉంది. మరి ఈ భారీ చిత్రం పూర్తయిన తర్వాత జక్కన్న నెక్స్ట్ ఎవరితో సినిమా చేస్తారు? అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ప్రస్తుతం సౌత్ నుంచి నార్త్ వరకు చాలా మంది టాప్ హీరోలు రాజమౌళి కాల్షీట్ల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే అందులో ముఖ్యంగా రెండు పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అందులో మొదటిది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

Cinema




మైసా' లుక్ తోనే 'కైసా హో గయా యైసా స్టార్' అనిపించుకుంది రశ్మిక మందణ్ణ. అంతేనా? 'మూడ్ ఆఫ్ ద నేషన్' సర్వేలో 'నంబర్ వన్ హీరోయిన్'గానూ నిలిచారు రశ్మిక. తెలుగువారి కోడలు కాగానే రశ్మిక తీరే మారిపోయిందనీ అంటున్నారు జనం. కన్నడ కస్తూరిలా గుబాళిస్తూ తెలుగువారిని వచ్చీరాగానే చుట్టేసింది రశ్మిక మందణ్ణ అందం. 'గీత గోవిందం' ఘనవిజయం తరువాత రశ్మిక – విజయ్ దేవరకొండ ప్రేమాయణం మొదలయింది. ఎవరికి వారు తమ సినిమాలతో బిజీగా సాగుతున్నారు. పెళ్ళయిన తరువాత విజయ్–రశ్మిక జోడీగా నటించిన 'రణబాలి' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా మళ్ళీ 'గీత గోవిందం' రేంజ్ లో ఆకట్టుకుంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. అంతకు మించి ఉంటుందని మరికొందరు భావిస్తున్నారు. ఏది ఏమైనా విజయ్ – రశ్మిక జోడీ పెళ్ళయిన తరువాత నటించిన మూవీ కాబట్టి 'రణబాలి'కి క్రేజ్ రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఓ మీడియా సంస్థ నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ద నేషన్'లో ఆల్ ఇండియాలో నంబర్ వన్ హీరోయిన్ గా రశ్మిక మందణ్ణ నిలవడం విశేషంగా మారింది. పుష్ప' సిరీస్ తో రశ్మిక మందణ్ణకు నార్త్ లోనే ఓ స్పెషల్ క్రేజ్ లభించింది. హిందీలో రశ్మిక నటించిన 'ఛావా, యానిమల్' చిత్రాలు బంపర్ హిట్స్ గా నిలిచాయి. "మిషన్ మజ్ను, సికందర్, కాక్ టెయిల్ 2" వంటి సినిమాలు అంతగా అలరించక పోయినా రశ్మిక అందం, అభినయం ఆల్ ఇండియా యూత్ ను విశేషంగా ఆకట్టుకుంది. రశ్మిక నటించిన 'తమ్మా' పాన్ ఇండియా మూవీగా రిలీజై అలరించింది. ఇప్పుడు రశ్మిక ప్రధాన పాత్రలో రూపొందిన 'మైసా' నవంబర్ లో జనం ముందుకు రానుంది. ఈ సినిమాలోని రశ్మిక లుక్ ఈ మధ్య రిలీజై జనాన్ని విశేషంగా ఆకర్షిస్తోంది. అలా జయాపజయాలతో సాగుతోన్న రశ్మిక ఇప్పుడు నంబర్ వన్ హీరోయిన్ అయ్యారు. ఇంతకు ముందు ఆల్ ఇండియా నంబర్ వన్ నాయికగా ఉన్న దీపికా పదుకోణెను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచారు. దాంతో రశ్మిక పేరును ఫ్యాన్స్ మరింతగా స్మరించుకోవడం విశేషం. రశ్మికకు పెళ్ళికాక ముందు బంపర్ హిట్స్ ఉన్నా, పెళ్ళయ్యాకే 'భారతదేశంలోనే అగ్రకథానాయిక'గా నిలిచారు. అలా తెలుగువారి కోడలైన తరువాతే రశ్మికకు కలసి వచ్చిందని కొందరు అంటున్నారు. రశ్మిక భర్త విజయ్ దేవరకొండ, అత్తమామలు సైతం ఆమెను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. రశ్మిక విజయాన్ని ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. మొన్నటి దాకా ఆల్ ఇండియాలో తమదైన బాణీ పలికించిన అలియా భట్, శ్రద్ధా కపూర్ సైతం రశ్మిక తరువాతి స్థానాల్లోనే సరిపుచ్చుకోవడం గమనార్హం. 'రామాయణ' భారీ చిత్రంలో నటించిన సాయిపల్లవి రశ్మిక తరువాత నాలుగో స్థానంలో నిలిచారు. 'మూడ్ ఆఫ్ ద నేషన్'లో యువత రశ్మికకే ఓటేశారు. ఇలా నంబర్ వన్ గా సాగుతోన్న రశ్మిక అక్టోబర్ 16న తన భర్త విజయ్ తో కలసి నటించిన 'రణబాలి'తో ముందుగా పలకరిస్తారు. ఆ తరువాత నవంబర్ లో 'మైసా'గా అలరిస్తారు. ఈ రెండు సినిమాలు కూడా ప్రేక్షకులను మెప్పిస్తే రశ్మిక జర్నీ మరో రేంజ్ లో సాగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. మరి 'రణబాలి'తో కొత్తగా పెళ్ళయిన జంట ఏ స్థాయి సక్సెస్ సాధిస్తుందో చూడాలి.

మీ ప్రత్యేకతను,
మీ వ్యాపార అభివృద్ధికి
కొందరు మాత్రమే
నమ్మకమైన సేవలందిస్తారు..



మీ శ్రేయస్సును ఆకాంక్షించే వారికి
ఆత్మీయతను పంచండి

మధురస్మృతులు
ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి మరింత దగ్గరవ్వండి. మీ కుటుంబం సభ్యులలో, మీ బంధుమిత్రులలో, మీ ఆఫీసులో సహోద్యోగి ఎవరైనా రిటైర్ అవుతున్నా, వైవాహిక జీవితం 60 వసంతాలు పూర్తి చేసి వసంతోత్సవం జరుపుకుంటున్నా, ప్రశంసలు అందుకున్న ఆయా సందర్భాల్లో వారి జీవిత విశేషాలు మధురస్మృతులు తో పంచుకోండి. పలువురికి ఆదర్శప్రాయులు కండి.



మా కార్యాలయము :-
మధురస్మృతులు
మాస పత్రిక
SREEJA SREE PUBLICATIONS
H.No: 1-3-129, Rajendra Nagar,
Mahabubnagar. PIN - 509001.
Ph : 9848997085, 08542-222814
e-Mail : ms.mbnr2@gmail.com

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085